

రూ.4.77 కోట్ల ఆదాయం

రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజుల్లో రీజియన్ పరిధిలో ఆర్టీసీకి రూ.4.77 కోట్ల ఆదాయం వచ్చింది.

- 8లో ▸



వృద్ధులను ఇబ్బంది పెడితే..

వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరుతూ రామేశ్వర్‌పల్లి వృద్ధ సంఘం తీర్మానించింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /23.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నార్మల్ డెలివరీలు చేయాలి



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆమె సందర్శించి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ చేయాలని అవసరమైతేనే సిజేరియన్ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రసూతి వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్, వైద్యులు అమృతరాంరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మోపాల్: ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. బుధవారం మండలంలోని బైరాపూర్ గ్రామంలో ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రత్యూష ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే చేపట్టారు. శిబిరానికి హాజరైన తుకారాం రాథోడ్ మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యశిబిరంలో 62 మందిని పరీక్షించగా, ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. 16 మందికి మలేరియా, 18 మందికి డెంగీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

నిజాంసాగర్‌లోకి 1,230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,230 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,391.11 అడుగులు (4.526 టీఎంసీలు) నీరు ఉందన్నారు.

మింగేస్తున్న నాలాలు

- డ్రెయినేజీలో పడి చిన్నారి గల్లంతు
- నగరంలోని ఆనంద్ నగర్ కాలనీలో విషాదం
- గతంలోనూ పలు ఘటనలు
- మెరుగుపడని డ్రెయినేజీ వ్యవస్థ



అనన్య తల్లితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మకరందు





ఆనంద్ నగర్‌లో డ్రెయినేజీలో పడి గల్లంతైన చిన్నారి అనన్య కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం సభ్యులు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని నాలాలు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. నాలాల్లో పడి గతంలో పలువురు మరణించారు. ఎంతోమంది ప్రాణాలతో బయటపడ్డారు. అయినా మున్సిపల్ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. తాజాగా బుధవారం సాయంత్రం ఓ చిన్నారి డ్రెయినేజీలో పడిపోయింది. ఆనందనగర్‌లో అనన్య(2) ఆడుకుంటూ ఇంటి ఎదుట ఉన్న డ్రెయినేజీలో పడి గల్లంతు కావడం కలకలం రేపింది. ఇలాంటి ఘటనలు నగరంలో పలుమార్లు జరిగాయి. అయినా అధికారులు పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఏటా రూ.కోట్లతో డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణాలు చేపడుతున్నా.. ప్రమాదకరంగా ఉన్న చోట రక్షణ చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

■ మధ్యాహ్నం జోరువాన.. ఇంటిముందున్న డ్రెయినేజీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ పక్కనే అక్కా, అన్నతో కలిసి ఆనందంగా ఆడుకుంటోంది చిన్నారి అనన్య. మృత్యువు తన కోసం డ్రెయినేజీ రూపంలో పొంచి ఉందని తెలియని ఆ పాప ఆడుకున్న అనంతరం అక్కా, అన్న వెంట ఇంట్లోకి వెళ్తూ అందులో పడిపోయింది. నిజామాబాద్ నగరంలోని ఆనంద్ నగర్‌లో బుధవారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. అనన్య ఇంట్లోకి రాకపోవడంతో బయటకు వచ్చిన తల్లిదండ్రులు డ్రెయినేజీలో పడిపోయిందని భావించి బోరున విలపించారు. చుట్టుపక్కల వారు డ్రెయినేజీలోకి దిగి వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. మున్సిపల్ అత్యవసర సిబ్బంది, పోలీసులు సుమారు 30 మంది వరకు సాయంత్రం 6 గంటల నుంచి గాలించారు. చీకటి పడటంతో రాత్రి 9.30 గంటలకు గాలింపు చర్యలు నిలిపివేశారు. మున్సిపల్ కమిషనర్ మకరందు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

చర్యలు శూన్యం

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. వర్షపు నీటిని, మురుగు నీటిని పూలాంగ్ వాగులోకి తీసుకెళ్లేందుకు ప్రధాన డ్రెయినేజీలు, కాలువలు ఉన్నాయి. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల మీదుగా ప్రధాన కాలువలు పోతున్నాయి. ఇక్కడే నాలాలో పడి చనిపోయిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం గౌతంనగర్‌లో ఓ బాలుడు ఇంటి ఎదుట డ్రెయినేజీలో కొట్టుకుపోయి మరణించాడు. అంబేడ్కర్ కాలనీలో డ్రెయినేజీలో బాలుడు కొట్టుకుపోయాడు. చంద్రనగర్‌లో ఓ వ్యక్తి నాలాలో కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ప్రతి బడ్జెట్లో ప్రధాన డ్రెయినేజీల నిర్మాణాలు, వరద నీటిని బయటకు పంపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కానీ వీటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం చిన్నారి నాలాలో గల్లంతవడంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

టౌన్ ప్లానింగ్

లీలలు చెప్పతరమా!

- దరఖాస్తు ఒకరి పేరుపై.. అనుమతి మరొకరి పేరిట
- రోడ్డు వెడల్పుతో సంబంధం లేకుండా భారీ భవనానికి అనుమతులు
- నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చిన ప్లానర్‌ను వదిలేసి ప్లాట్ ఓనర్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వైనం
- ఇదీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం తీరు



శ్రద్ధానంద్‌గంజ్‌లో నిర్మాణంలో ఉన్న భవనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం కారణంగా ప్లానింగ్‌లెస్ సిటీ (ప్రణాళిక లేని నగరం) అనేలా పరిస్థితి తయారైంది. నిర్మాణాల అనుమతులకు సంబంధించి వసూళ్ల పర్వంలో అనేక వ్యవహారాల నుంచి ప్రభుత్వ ఫీజుకు గండికొట్టడం వరకు యథేచ్ఛగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఒక్క ఐడీపై వందల దరఖాస్తులు చేయించిన టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు ఇటీవల మరో వ్యవహారంలో సొంత రూల్స్ ఏర్పాటు చేసుకుని అమలు చేశారు. నగరంలోని గాయత్రినగర్ ఏరియాలో 773, 774, 775, 787, 790, 791 సర్వే నంబర్లలో ఓ వ్యక్తి వెంచర్ వేసి చాలావరకు ప్లాట్లను అమ్మేశాడు. కాగా ఇందులో ఒక ప్లాట్‌లో నిర్మాణానికి సంబంధించి వెంచర్ వేసిన వ్యక్తి పేరిట బిల్డర్ టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా చేసిన ప్రవీణ్ సైట్ ఇన్‌స్పెక్షన్ సైతం చేశాడు. డిస్ట్రిక్ట్ సిటీ ప్లానర్ వికాస్ అప్రూవల్‌తో అనుమతులు ఇచ్చారు. విచిత్రమేమిటంటే అదే దరఖాస్తుపై మరొక వ్యక్తి పేరుమీద అనుమతులు ఇచ్చారు. సదరు అనుమతులు పొందిన వ్యక్తి మరొక ప్రభుత్వ ఉద్యోగికి నిర్మించిన ఇల్లును అమ్మేసి బ్యాంకు లోన్ ఇప్పించడం విశేషం.

■ మరో విషయానికి వస్తే శ్రద్ధానంద్‌గంజ్ ఏరియాలో ప్రభాత్ టాకీస్ వద్ద ఓ నిర్మాణానికి సంబంధించి నిబంధనల ప్రకారం రోడ్డు నుంచి 30 అడుగుల జాగా వదలాల్సి ఉండగా 25 అడుగులు మాత్రమే వదిలారు. అయినప్పటికీ ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ సిటీ ప్లానర్ శ్యాం అనుమతి ఇచ్చారు. ఇక్కడ అధికారులే జీవో 168ని ఉల్లంఘించడం గమనార్హం.

■ ఇక ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చే విషయంలో ఇష్టారీతిన వ్యవహరించడం టౌన్ ప్లానింగ్ విభాగానికే చెల్లింది. డీసీపీగా వికాస్ ఉన్న సమయంలో ఒక వ్యక్తి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసేందుకు ఓ లైసెన్స్‌డ్ ఇంజినీర్‌ను సంప్రదించాడు. అయితే ఆ లైసెన్స్‌డ్ ఇంజినీర్ నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించాడు. ఇందులోనూ టౌన్ ప్లానింగ్ ఉద్యోగులదే కీలకపాత్ర అని తెలుస్తోంది. తరువాత ఈ విషయమై ప్లాట్ ఓనర్‌ను కొందరు ఉద్యోగులు బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే ఇది నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ధ్రువీకరణ అని ప్లాట్ ఓనర్‌కు తెలియదు. దీనిపై అతనికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు పంపారు. దీంతో ఆ వ్యక్తి లైసెన్స్‌డ్ ఇంజినీర్ వద్దకు వెళ్లి నోటీసులు చూపించాడు. ఈ నోటీసుకు సంబంధించి సదరు వ్యక్తి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఇంజినీరు రిప్లై పంపాడు. తరువాత ఫీజు కట్టాల్సిందేనని టౌన్ ప్లానింగ్ నుంచి మరో నోటీసు ప్లాట్ ఓనర్‌కు పంపారు. ఈ అంశంలో నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించిన లైసెన్స్‌డ్ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ప్లాట్ ఓనర్ ఫిర్యాదు చేస్తే..

దాన్ని వదిలేసి ఫిర్యాదు చేసిన వ్యక్తినే ఇబ్బంది పెడుతుండడం విశేషం. ఈ విషయాలపై వివరణ కోసం 'సాక్షి' మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మకరంద్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

- ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- సెప్టెంబర్ 6న వార్డులవారీగా 'ముసాయిదా' ప్రదర్శన

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. అందులోభాగంగా గ్రామాల్లో వార్డులవారీగా ఓటరు జాబితా తయారీకి బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1తో ముగిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పార్లమెంట్ ఎన్నికలు, పాలకవర్గాల గడువు ముగిసిన నాటి నుంచే పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని గ్రామాల్లో ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఈనేపథ్యంలో ఓటరు జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసి పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు కీలక అడుగు వేసింది.

జిల్లాలో 545 గ్రామపంచాయతీలు, 4,501 వార్డు స్థానాలు ఉన్నాయి. గ్రామాల్లో సుమారు 6.80లక్షల వరకు ఓటర్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఓటర్ల జాబితా తయారీ, వార్డుల రూపకల్పన, తదితర అంశాలపై ఇప్పటికే ఎంపీడీవోలు, ఎంపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణనిచ్చిన విషయంతెలిసిందే. ఇటీవల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడంతో ఆ జాబితాలో ఎలాంటి మార్పులు ఉండబోవని అధికారులు పేర్కొంటున్నారు. వార్డుల వారీగా జాబితా తయారు చేసి, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. తాజాగా వార్డులవారీగా ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ విడుదలైంది.



సెప్టెంబర్ 21న తుది జాబితా

గ్రామ పంచాయతీల్లో వార్డులవారీగా తయా రు చేసిన ముసాయిదా ఓటరు జాబితాను గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్‌లో సెప్టెంబర్ 6న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రదర్శించనుంది. అంతకుముందు ఈనెల 29న ఇదే అంశంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీవరకూ ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 9, 10న అన్ని రా జకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏ ర్పాటు, 19న అభ్యంతరాలను పరిశీలిస్తారు. 21న తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు.

నేడు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక

ఖలీల్‌వాడి: హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే గురువారం నిజామాబాద్ రానున్న ట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నాల్సా, జిల్లా న్యాయసేవాధికా ర సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్లు క మ్యూనిటీ వలంటీర్ల ట్రెనింగ్ ప్రోగ్రాంకు ఆయన హాజరవుతారని పేర్కొన్నారు. హైకోర్టు జడ్జీలు సౌజాయ్‌పాల్, సురేందర్, శ్రీనివాస్‌రావు సైతం హాజరవుతారని తెలిపారు.

రైతులు బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడొద్దు

- కుటుంబానికి రూ.రెండు లక్షల రుణమాఫీ
- మాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దు
- నోడల్ అధికారులకు సమస్య తెలపాలి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పక్కన మోహన్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్

ఖలీల్‌వాడి: రుణమాఫీపై రైతులు ఆందోళన చెందొద్దని, కుటుంబానికి రూ.రెండు లక్షల రుణమాఫీ అవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. రుణమాఫీపై రైతులు బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడొద్దని సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో రెండుసార్లు రుణామాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. భార్యకు ఇస్తే భర్తకు రుణామాఫీ ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ సమస్యల పరిష్కారానికి ప్రతి మండలానికి నోడల్ ఆఫీసర్‌ను నియమించామని తెలిపారు. రైతులు గ్రామాల వద్దకు వచ్చే అధికారులకు వివరాలు అందించాలని సూచించారు. ధరణిలో వచ్చిన లోపాలతోనే రుణామాఫీకి ఇబ్బందులు వచ్చాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆందోళనలు విరమించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి, లింగం, విపుల్ గౌడ్, సంతోష్, శ్రీనివాస్, సాయిలు, దత్తు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



బోర్గాం(పి) శివారులో నాన్ లేఅవుట్ ప్లాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరందుతో కలిసి బోర్గాం(పి) శివారులోని నాన్ లేఅవుట్ ప్లాట్లను పరిశీలించారు. మొబైల్ యాప్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన సందర్భంగా గమనించిన అంశాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి అధికారులను ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని, ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే, వారు అందుబాటులో ఉంటారని చెప్పారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

అన్నీ ఉల్లంఘనలే

- బకాయిలు ఉన్నవారిని పీఠం ఎక్కించేందుకు అవిశ్వాసం నోటీసులు ఇచ్చిన సింహాచలం
- మరోవైపు వ్యక్తిగత కోర్టు ఖర్చులు సైతం సొసైటీ నుంచే చెల్లించిన వైనం
- ప్రస్తుతం ఐదేళ్ల ఆడిట్ విచారణ పారదర్శకత లేకుండానే..
- ఇదీ సిరికొండ సహకార సంఘంలో పరిస్థితి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతుల భాగస్వామ్యంతో నడుస్తున్న సహకార సంఘాలను భ్రష్టు పట్టించడమే లక్ష్యంగా అధికారి వ్యవహరిస్తే ఎలా ఉంటుందో తెలియాలంటే జిల్లాలోని పలు సొసైటీలను చూస్తే అర్థమవుతుంది. ఒక్కో సొసైటీలో ఒక్కో తీరుగా దోపిడీ పర్వం నడిపించారు. జిల్లాలోని సిరికొండ సొసైటీని చూస్తే ఇదేం చోద్యం అనిపించక మానదు. వక్రమార్గంలో పీఠం ఎక్కాలనుకునే వాళ్లకు అప్పటి జిల్లా సహకార అధికారి సింహాచ లం పూర్తిగా సహాయ సహకారాలు అందించి బైలా ను ఉల్లంఘించడం విశేషం. నిబంధనలకు విరుద్ధంగా అప్పటికే బకాయిలు ఉన్నవాళ్లను చైర్మన్, వైస్‌చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టేందుకు వ్యవహారం నడిపాడు. ఇందులో భాగంగా 2024 ఫిబ్రవరి 9న సింహాచలం అవిశ్వాసం నోటీసు ఇచ్చాడు. ఫిబ్రవరి 15న అవిశ్వాసం పెట్టి చైర్మన్ మైలారం గంగారెడ్డి, వైస్‌చైర్మన్ అయిత ప్రకాష్‌ను దించేశారు. అక్రమ మార్గంలో చెల్లం గంగాధర్‌ను చైర్మన్‌గా, సైరి నర్సయ్యను వైస్‌చైర్మన్‌గా పీఠంపై కూర్చోబెట్టారు. 22న కొత్త పాలకవర్గం ప్రమాణం చేసింది. అయితే గంగాధర్, నర్సయ్య తాము చెల్లించాల్సిన బకాయిలను ఎన్నిక రోజే చెల్లించారు. బకాయిలు ఉన్నవాళ్లకు అనుకూలంగా, నిబంధనలకు విరుద్ధంగా అవిశ్వాసం పెట్టిన విషయమై పదవీచ్యుతులైన గంగారెడ్డి, ప్రకాష్‌లు హైకోర్టుకు వెళ్లారు. కాగా ఈ కేసును ఎదుర్కొనేందుకు గాను కొత్తగా ఎన్నికైన గంగాధర్, నర్సయ్యలు సొసైటీ నుంచి రూ.2.50 లక్షలు లాయర్ ఫీజు చెల్లించడం గమనార్హం. తా ము బకాయిలు ఉన్న విషయాన్ని అప్పటి సీఈవో నరేష్ కావాలనే బయటపెట్టినట్లు భావించిన గంగాధర్, నర్సయ్యలు సింహాచలంకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నరేష్‌కు సింహాచలం సంజాయిషీ నోటీసు ఇవ్వడం గమనార్హం. దీనిపై అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి పోశన్నకు నరేష్ మార్చి 13న వివరణ ఇచ్చాడు. సదరు బకాయిలకు సంబంధించి సంఘంలో తీర్మానం చేసి తీసుకున్నట్లు పేర్కొన్నాడు.

ఆడిట్ విచారణకు ఉత్తర్వులు

ఈ గందరగోళం నేపథ్యంలో ప్రస్తుతం డీసీవోగా ఉన్న శ్రీనివాస్ 5 సంవత్సరాల లెక్కలకు సంబంధించి (51 ఎంక్వైరీ) ఆడిట్ కోసం ఉత్తర్వులు ఇచ్చా రు. విచారణ కోసం అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోశన్నను నియమించారు. 2019-20, 2020-21, 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఈ విచారణ చేయాలని డీసీవో పేర్కొన్నారు. విచిత్రంగా మొదటి రెండేళ్లు, చివ రి రెండేళ్లు (మొత్తం నాలుగేళ్లు) వదిలిపెట్టి కేవలం 2021-22 సంవత్సరానికి మాత్రమే విచారణ చేస్తుండడం గమనార్హం. దీనిపై ఆ ఏడాది సీఈవోగా పనిచేసిన నరేష్‌కు నోటీసులు ఇవ్వకుండానే నేరుగా 2024 ఆగస్టు 9న సమన్లు ఇచ్చారు. ఈ సమన్లలో నరేష్ చేరిన తేదీని, రిలీవ్ అయిన తేదీని సైతం తప్పుగా రాశారు. దీంతో నరేష్ సంతకం పెట్టకపోవడంతో తేదీలు మార్చి మళ్లీ పంపారు. పైగా సమన్లు ఏ అంశంపై అనేది కూడా పేర్కొనకపోవడం విశేషం.

విచారణ సమయంలో కొత్త పాలకవర్గం..

విచారణ చేస్తున్న పోశన్న వివరాలు సేకరించే సమయంలో కొత్త పాలకవర్గ సభ్యులను కూర్చోబెట్టుకోవడం విడ్డూరం. దీనిపై నరేష్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. తనకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా సమన్లు ఇచ్చి చట్టాన్ని ఉల్లంఘించినట్లు నరేష్ పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా విచారణకు నరేష్‌ను ఈ నెల 13న రావాలని సమన్లు ఇచ్చిన విచారణాధికారి అయిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోశన్న మా త్రం ఆ రోజు అక్కడకు రాలేదు. సమాచారం లేకుండానే మరుసటి రోజైన 14వ తేదీన హాజరు కావడం గమనార్హం. మళ్లీ 16వ తేదీన వాట్సప్ ద్వారా నరేష్‌కు నోటీసులు పంపి 12వ తేదీన విచారణకు హాజరు కాలేదని అందులో రాయడం మరింత విచిత్రం. ఈ విషయాలపై జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా విచారణాధికారికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు. విచారణను తప్పుదోవ పట్టించేందుకు కొందరు బయటి వ్యక్తులు ప్రయత్నాలు చేయడం సహజమన్నారు.

క్లుప్తంగా

మూడో టౌన్ ఎస్సైగా మహేశ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ ఎస్సైగా మహేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి నుంచి మూడో టౌన్‌కు వచ్చారు. ఇది వరకు పని చేసిన ప్రవీణ్‌కుమార్ నిర్మల్ జిల్లా బోథ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం సిబ్బంది ఎస్సైకు అభినందనలు తెలిపారు.

చర్చావేదిక బ్రోచర్ ఆవిష్కరణ



దోమకొండ: తెయూ సౌత్ క్యాంపస్‌తో పాటు దోమకొండ గడికోట సంయుక్తంగా నిర్వహిస్తున్న చర్చా వేదిక బ్రోచర్‌ను తెయూ రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. దోమకొండలోని గడికోటలో ఈనెల 24న చర్చావేదిక ఉంటుందన్నారు. తెలంగాణ చరిత్ర, వారసత్వంపై చర్చావేదిక ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, కో–డైరెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఇబ్బంది పెడితే ఊరుకోం



భిక్కనూరు: వృద్ధులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని, ఎవరైనా తల్లిదండ్రులకు తిండిపెట్టని కుమారుల ఇంటి ముందర ధర్నా చేస్తామని భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ శివసాయిరెడ్డి వృద్ధుల సంఘం సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గ్రామంలోని వృద్ధ సంఘ భవనంలో గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రాజిరెడ్డి, అధ్యక్షుడు తక్కళ్ల రాజిరెడ్డి అధ్యక్షతన సమావేశమైన వృద్ధులు జాతీయ వృద్ధుల దినోత్సవం జరుపుకున్నారు. కేకు కోసి ప్రజలకు పంచిపెట్టారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించి ఈ తీర్మానం ప్రతిని సీఎం, పీఎంలకు పంపించారు. సంఘం ఉపాధ్యక్షుడు సందుగారి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో రూ.4.77 కోట్ల ఆదాయం

- రాఖీ పండుగ నేపథ్యంలో సర్వీసులను పెంచిన ఆర్టీసీ
- ఇప్పటి వరకు 6.59 లక్షల మంది ప్రయాణం



ఖలీల్‌వాడి: ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ పరిధిలో మూడు రోజుల్లో రూ. 4.77 కోట్ల ఆదాయం వచ్చింది. రాఖీ పండుగ సందర్భంగా ఈ నెల 18 నుంచి 20 వరకు రీజియన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల్లో ఉన్న తోడబుట్టిన అన్న, తమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు మహిళలు ఆర్టీసీల్లో అధిక సంఖ్యలో ప్రయాణం చేశారు. సోమవారం రికార్డు స్థాయిలో 3.59 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించారు. ఆర్టీసీ రీజియన్‌లో ఈ ఒక రోజే రూ.1.73 కోట్ల ఆదాయం వచ్చింది. రాఖీ పండుగను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ఉమ్మడి జిల్లాలోని వివిధ రూట్‌లలో 545 బస్సులను నడిపించగా హైదరాబాద్ సిటీ నుంచి మరో 20 బస్సులను నిజామాబాద్, కామారెడ్డి మీదుగా నడిపించారు. మూడు రోజుల పాటు ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా నమోదయ్యే రూట్లలో రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపారు. ఆదివారం రూ.1.41 కోట్ల ఆదాయం రాగా సోమవారం అనూహ్యంగా రూ.1.73 కోట్లు, మంగళవారం రూ.1.62 కోట్ల ఆదాయంతో ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది.

మహాలక్ష్మి ప్రయాణికులే అధికం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి ముందు నిజామాబాద్ రీజియన్ స్థాయిలో రోజుకు సగటున 1.80 లక్షల మంది ప్రయాణించేవారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి రోజు సగటున 2.64 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రాఖీ పండుగ సందర్భంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆదివారం 1.89 లక్షలు, సోమవారం 2.49 లక్షలు, మంగళవారం 2.20 లక్షల మంది ప్రయాణించారు. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ బస్సుల ద్వారా మూడు రోజుల్లో 6.59 లక్షల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

ఇబ్బందులు లేకుండా చేశాం

రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి నిజామాబాద్‌లోని ఆరు డిపోల పరిధిల్లో బస్సులను అందుబాటులో ఉంచాం. ప్రయాణికులకు ఏ డిపోలో కూడా ఇబ్బంది రాకుండా తగు చర్యలు తీసుకున్నాం.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

పలువురు ఎస్సైల బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైల బదిలీలు మళ్లీ జరిగాయి. పది రోజుల క్రితం 40 మంది ఎస్సైల బదిలీలుగా జరగగా తాజాగా మరో 10 మందిని బదిలీలు చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన ఎస్సైల వివరాలు..

ఎస్సై	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం			
రాజశేఖర్	బోధన్ రూరల్	మాక్లూర్	విక్రమ్	ఒకటో టౌన్	మోర్తాడ్
మచ్చేందర్	బోధన్ టౌన్	బోధన్‌రూరల్	సాయన్న	ఎస్‌బీ	రుద్రూర్
పాండేరావు	వీఆర్	షస్ టౌన్–1	గోవింద్	వీఆర్	ఆర్మూర్–1
గంగాధర్	ఆర్మూర్–1	ఐదో టౌన్	ఇంద్రకరణ్‌రెడ్డి	ధర్మపురి(జగిత్యాల)	ఆర్మూర్–2
వెంకట్రావు	ఐదో టౌన్	ఆరో టౌన్	గంగాధర్	ఆర్మూర్–2	వీఆర్

ఎస్సారెస్పీని సందర్శించిన తమిళనాడు బృందం



ఎస్సారెస్పీని సందర్శిస్తున్న తమిళనాడు బృందం

బాల్కొండ: మండల కేంద్రంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును తమిళనాడు నీటి పారుదల శాఖ అధికారుల బృందం బుధవారం సందర్శించింది. అనంతరం నీటి వినియోగదారుల సంఘం మాజీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన నీటి వినియోగదారుల సంఘాలనే ప్రస్తుతం కొనసాగేలా చూడాలని తమిళనాడు బృందానికి సంఘం మాజీ సభ్యులు సూచించారు. అన్ని రాష్ట్రాల రైతుల అభిప్రాయాలను సేకరించి నివేదికన ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. ఇది వరకు పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలలో పర్యటన కొనసాగిందని తెలంగాణ అనంతరం మహారాష్ట్రను సందర్శిసామన్నారు. ఎస్సారెస్పీని సందర్శించి ప్రాజెక్ట్ నిర్మాణ, నీటి విడుదల, కాలువల వివరాలను ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తమిళనాడు నీటిపారుదలశాఖ అధికారులు రాజు, జగన్, మంగయార్కరసీ, సుబ్బరాజు, కార్కియన్, సునీత, అన్నపూర్ణ, ఎస్సారెస్పీ డిప్యూటీఈఈ రఘుపతి, ఏఈఈ వంశీ తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 కోట్లతో ఉడాయింపు!

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఓ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు రూ.10 కోట్లతో ఉడాయించినట్లు సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నాయి. నాందేవ్‌వాడ కేంద్రంగా ఏజెన్సీ నడుపుతున్న సదరు వ్యక్తి మార్కెట్‌లో అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. ప్రతి నెల రూ. కోట్లలో ఏజెన్సీ టర్నోవర్ జరిగేది. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు చాలా మంది నమ్మి రూ.లక్షల్లో ముట్టజెప్పారు. ఇందులో కొంత మంది వైద్యులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెన్సీ నిర్వాహకులు, హోల్‌సేల్ ఏజెన్సీలు సైతం నిర్వాహకుడికి రూ. లక్షల్లో అప్పగించింది. ఈనెల 16 నుంచి అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సదరు వ్యక్తి ఉంటున్న గాయత్రినగర్‌లోని ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. తాము మోసపోయామని బాధితులు లబోదిబో మంటున్నారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మె నోటీస్

నిజామాబాద్‌నాగారం: ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఈ నెల 23 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలుపుతూ జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌కు బుధవారం నోటీసు అందజేశారు. క్యాడర్ చేంజ్, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రతపై శాంతియుతంగా రెండురోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి



నిరసన తెలుపుతున్న మాలమహానాడు సభ్యులు

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీం కోర్టు తీర్పుపై పునరాలోచించాలని జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ రద్దు విషయమై బుధవారం నిర్వహించిన భారత్ బంద్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని పాఠశాలలు, పెట్రోల్ బంకులు, వ్యాపార సముదాయాలు, బస్‌డిపోలను బంద్ చేయించారు. కొందరు నాయకులు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు బంగారు సాయిలు, సక్కి చంద్రశేఖర్, నాంది సుశీల్ కుమార్, నీరడి లక్ష్మణ్, ఎడ్ల నాగరాజు, నీలగిరి రాజు, పులి జైపాల్, వినయ్, ధనరాజ్, సూర పోశెట్టి, తొక్కిడి నారాయణ, దౌలత్ చక్రి, రామచందర్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి కట్టడాలు చరిత్రకు ఆధారాలు

- రిజిస్ట్రార్ యాదగిరి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): ఆనాటి కట్టడాలు చరిత్రకు ఆధారాలని, పూర్వం అల్లకొండ (బాల్కొండ)లో నిర్మించిన ఇంజినీరింగ్ విధానం గొప్పదని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. బాల్కొండకు చెందిన బీఆర్ నర్సింగ్‌రావు రాసిన 'అల్లకొండ ఊరు ఉద్భవం–ఐదు ఆలయాలకు ప్రసిద్ధి' అనే చరిత్ర పుస్తకాన్ని బుధవారం తన చాంబర్‌లో రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. దేశంలోని పురాతనమైన చారిత్రక కట్టడాలకు మరమ్మతులు చేయకుండా వదిలేస్తే వాటి ఆనవాళ్లు లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. పూర్వ రాజుల కాలంలో నిర్మితమైన పలు కట్టడాలు శిథిలావస్థలో ఉన్నాయని ఆయా కట్టడాల రక్షణ, పునఃనిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాలకు గుర్తుండి పోయే విధంగా పూర్వ చరిత్రను వెలుగులోకి తెచ్చిన పుస్తక రచయిత నర్సింగ్‌రావును రిజిస్ట్రార్ అభినందించారు. పుస్తక రచయిత మాట్లాడుతూ.. తెయూ ద్వారా తాను రాసిన పుస్తకానికి గుర్తింపు ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

డిచ్‌పల్లి: భూముల క్రమబద్ధీకరణకు అందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) అంకిత్, జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తుల తరుణ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి అడిషనల్ కలెక్టర్, ధర్మారం(బి) గ్రామాన్ని డీపీవో వేర్వేరుగా సందర్శించారు. ఆయా గ్రామాల్లో మొబైల్ యాప్ ద్వారా ఎల్–1 అధికారుల బృందం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న దరఖాస్తులను తిరస్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే, వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఇరిగేషన్ ఏఈ శ్రీచంద్, ఆర్‌ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు రమేశ్, జయశ్రీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి



ఎడపల్లి: మండల కేంద్రంలో ఓ తండ్రిపై కుమారుడు దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ధ్యాకం భూమయ్య భార్య లక్ష్మిల కుమారుడు శ్రీనివాస్ గత పదేళ్ల నుంచి ఆస్తి విషయంలో తండ్రితో గొడవ పడుతున్నాడు. పలుమార్లు తండ్రిపై దాడి చేశాడు. బుధవారం ఉదయం పొలంలో మోటార్ వేసే విషయంలో తండ్రితో గొడవ పడి దాడి చేశారు. దీంతో తండ్రి పోలీస్ స్టేషన్‌లో కుమారుడిపై ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా రాఖీ పండుగకు వచ్చిన తన చిన్న కుమార్తె సుజాతపై సైతం చేయి చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తన కుమారుడిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్(50) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఎస్సై నారాయణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రజక వృత్తి చేసుకునే లక్ష్మణ్ కాలువలో బట్టలను ఉతుకుతుండగా ప్రమాదవశత్తు నీటిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తిరుపతి కొండ ఎక్కుతుండగా బోధన్‌వాసి..



బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తిరుపతిలో స్వామి వారి దర్శనం కోసం కొండ మెట్లు ఎక్కుతుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు జనార్దన్‌చారి(52) భార్య, కుమార్తెతో కలిసి తిరుపతికి రెండు రోజుల క్రితం జిల్లా నుంచి బయలుదేరి వెళ్లారు. బుధవారం తిరుపతిలో స్వామి వారి దర్శనం కోసం కొండ మెట్లు ఎక్కుతుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. పలువురు ప్రముఖులు, స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు ప్రభాకర్ చారి, సుధాకర్ చారి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

కారు–ఆటో ఢీకొని ఒకరికి గాయాలు



పిట్లం: మండలంలోని రాంపూర్ శివారులో కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మహిళకు గాయాలు కావడంతో ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం రాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..



ఎడపల్లి: టీవీఎస్ ఎక్సెల్, ఆటో ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం నాగనపల్లికి చెందిన భార్యాభర్తలు టీవీఎస్ ఎక్సెల్ పై బోధన్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా దూపల్లి గేట్ సమీపంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో వీరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుట్కా స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని కుమార్‌గల్లీలో గుట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఈ దాడిలో రూ.1లక్ష52 వేల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు.

న్యావనందిలో పేకాట స్థావరంపై..

సిరికొండ: మండలంలోని న్యావనంది శివారులో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. పేకాట ఆడుతున్న 11 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 31,500 నగదు, 11 సెల్ ఫోన్లు, 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లిపోయిన మృతదేహం లభ్యం

మద్నూర్(జుక్కల్): మండల సమీపంలోని జాతీయ రహదారి పక్కన కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల శివారులోని జాతీయ రహదారికి 50 గజాల దూరంలో ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతదేహం ఒంటిపై నల్లని ప్యాంటు, గోధుమ రంగు షర్ట్ ఉందన్నారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. మృతదేహానికి బట్టతల ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712686177, 8712686175 నంబర్లను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



బస్వరాజ్

బోధన్‌రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని హున్సాలో చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హున్సాకు చెందిన బస్వరాజ్(21) మద్యానికి బానిసై ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ ఢీకొన్న ఘటనలో..

నిజామాబాద్‌రూరల్: బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన నారాయణగౌడ్(63) మంగళవారం ముత్తకుంట వైపు తాటి చెట్లు గీయడానికి తన బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నారాయణను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నవీపేటలో మరొకరు..

నవీపేట: ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఈరగొట్టు సాయిలు(52) క్రేజ్‌వీల్ ట్రాక్టర్‌పై కూలీగా పనిచేస్తున్నాడు. 20 రోజుల క్రితం గ్రామంలో ట్రాక్టర్‌పై కూలీగా పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీమా డబ్బుల కోసం తల్లిని చంపిన కొడుకు



అంజవ్వ(ఫైల్)

నస్రుల్లాబాద్: తండ్రి బీమా డబ్బుల కోసం ఓ కొడుకు తల్లిని చంపిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై వెంకట్రావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మెక్క అంజవ్వ(46) భర్త సాయిలు గతంలో మృతిచెందాడు. సాయిలు మృతితో బీమా డబ్బులు వచ్చాయి. అందులో కొంత డబ్బును కొడుకు సాయికుమార్‌కు మరి కొంత డబ్బును బ్యాంకులో జమ చేసింది. అయితే బ్యాంకులో ఉన్న డబ్బులు సైతం ఇవ్వాలంటూ సాయి కుమార్ తల్లితో గొడవ పడేవాడు. మంగళవారం సైతం వీరి మధ్య గొడవ జరిగింది. డబ్బులు ఇవ్వడం లేదనే కోపంతో సాయి కుమార్ తల్లిని విపరీతంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక అంజవ్వ మృతి చెందింది. కుమార్తె సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

లింగంపేటలో ప్రైవేట్ ఆస్పత్రి సీజ్

- అనుమతులు లేకుండా శస్త్ర చికిత్సలు
- డెంగీ కేసులకు వైద్యం అందించినందుకు..



ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

లింగంపేట: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకుమార్ బుధవారం సీజ్ చేశారు. మండలంలోని బాయంపల్లి కిషన్‌నాయక్ తండాకు చెందిన బీటెక్ విద్యార్థి సబావత్ చౌహాన్ వీరేందర్(22) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందిన విషయం విధితమే. సదరు విద్యార్థికి డెంగీ పరీక్షలు చేసి వైద్యం అందించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన వెల్లడించారు. ఈ విషయమై ఆయా దిన పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా జిల్లా వైద్యాధికారులు స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారులు తండాకు చేరుకొని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాహుల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో అనుమతి లేకుండా ఉన్న ఆపరేషన్ థియేటర్‌పై వైద్యుడిని ప్రశ్నించారు. సదరు ఎంబీబీఎస్ వైద్యుడు లేకుండానే అతని పేరిట ప్రైవేటు వైద్యుడు రాజు ఆపరేషన్లు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. దీంతో ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆస్పత్రిని సీజ్ చేసినట్లు ప్రభుకుమార్ తెలిపారు. ఆస్పత్రిని సీజ్ చేసిన విషయాన్ని జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్‌కు నివేదిక అందించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి హిమబిందు, డీఎంవో సిబ్బంది శ్రీనివాస్, శివయ్య, సూపర్‌వైజర్ ఫరీదాబేగం, సీహెచ్‌వో రమేశ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో బిహార్‌కు చెందిన రోహిత్‌కుమార్(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోహిత్ బిహార్ నుంచి 12రోజుల క్రితం ఎర్రాపహాడ్‌కు చెందిన ఓ వ్యక్తి పశువుల షెడ్డులో పనికి చేరాడు. కాగా రోజువారీలాగే పని చేస్తున్న రోహిత్ బుధవారం సాయంత్రం షెడ్డు ప్రాంతంలో ఎవరూ లేని సమయంలో షెడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరు..

రామారెడ్డి: కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సింగరాయపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెడ్డు అనిల్(26) కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాలు, భార్యను ఆస్పత్రుల్లో చూయించేందుకు, గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు పెరిగిపోవడంతో ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సౌభాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఖిల్లా చౌరస్తాలో మంగళవారం రాత్రి గంజాయి తరలిస్తున్న పాత నేరస్తుడు షేక్ అస్లాంను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ బుధవారం తెలిపారు. నిందితుడి నుంచి 260 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా మూడు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో మరొకరు..

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్‌నగర్ తండాలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. బుధవారం జక్రాన్‌పల్లి పీఎస్‌లో నిందితుడి వివరాలు వెల్లడించారు. వివేక్‌నగర్ తండాకు చెందిన బానవత్ సురేష్ ఈ నెల 17న తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి దైవదర్శనం కోసం తిరుపతికి వెళ్లాడు. అదే రోజు సురేష్ వద్ద కూలీ పని చేసిన కోనేటి నరేశ్ అర్ధరాత్రి సురేష్ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. లక్ష నగదుతో పాటు రెండు తులాల బంగారు నెక్లెస్, తులం జత బంగారు బుట్టలు, నాలుగున్నర గ్రాముల ఉంగరం, ఇరవై తులాల పట్టగొలుసులు దొంగిలించినట్లు పేర్కొన్నారు. సురేష్ తండ్రి బానవత్ జీలా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగిలించిన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసును త్వరగా చేధించేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు మహేందర్, రాంచందర్, రాములును ఎస్సై అభినందించారు.

చీటింగ్ కేసులో నలుగురి రిమాండ్

లింగంపేట: విక్రయించిన భూమిని తిరిగి పొందడానికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీఎస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల నారాయణ తండ్రి వెంకయ్య తన వ్యవసాయ భూమిని 2002లో అదే గ్రామానికి చెందిన చల్ల నారాయణ తండ్రి హన్మయ్యకు విక్రయించినట్లు తెలిపారు. తక్కువ ధరకు విక్రయించిన భూమిని తిరిగి సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించాడు. తన భూమిని కబ్జా చేసేందుకు తప్పుడు హద్దులతో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించినట్లు బాధితుడు నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో 11 మందిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిలో చల్ల రాజు, చల్ల రాములు, చల్ల మాణిక్యం, చల్ల గంగాధర్‌ను రిమాండ్‌కు తరలించగా మిగిలిన ఏడుగురు పరారిలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.